## కార్యకర్తలకు భరోసాగా ఉంటాం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

ఎల్లారెడ్డిపేటలో మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా చెక్కులనందిస్తున్న తోట ఆగయ్య, నాయకులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 8: బీఆర్ఎస్ కోసం పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకూ భరోసాగా ఉంటామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మంగళవారం అన్నారు. ఇటీవల ప్రమాదాల్లో మృతి చెందిన కార్యకర్తలు సందుపట్ల లక్ష్మారెడ్డి, మిర్యాల్‌కార్ సాయి కుటుంబాలను పరామర్శించారు. వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి మంజూరైన రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కులను అందించారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఎడ్ల సందీప్, నాయకులు పందిల్ల నాగరాణి, శ్యామ మంజుల, పిల్లి కిషన్, అందె సుభాశ్, గుల్లపల్లి నర్సింహారెడ్డి, దొనుకుల కల్యాణ్, నమిలికొండ శ్రీనివాస్, బాలయ్య, ఎన్గందుల నర్సింలున్నారు.

## క్రీడలపై ఆసక్తి, నైపుణ్యం పెంచేలా ప్రణాళికలు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- జిల్లా కేంద్రంలో టార్చ్ ర్యాలీ నిర్వహణ

టార్చ్ ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్, అక్టోబర్ 8: యువత క్రీడలపై ఆసక్తి, నైపుణ్యం పెంచేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తున్నదని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే శ్రీనివాస్ తెలిపారు. సీఎం కప్ టార్చ్ ర్యాలీ మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్దకు చేరుకోగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి ప్రారంభించి, మాట్లాడారు. యువత ఒలింపిక్స్‌లో పతకాలు సాధించేలా శిక్షణ ఇచ్చేందుకు హైదరాబాద్ గచ్చిబౌలిలో అంతర్జాతీయస్థాయి సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నదని తెలిపారు. ఇక్కడ మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి రాందాస్, యువతి, యువకులు పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా పత్తి కొనుగోలు

కలెక్టరేట్, అక్టోబర్ 8: ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో వచ్చే పత్తి పంటను మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లో పత్తి కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో పత్తి కొనుగోలు యాక్షన్ ప్లాన్‌ను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పత్తి పంటకు మద్దతు ధర అందేలా చూసేందుకు జిల్లాస్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన ప్రభుత్వం జిల్లా స్థాయి కమిటీ నియమించిందని తెలిపారు. జిల్లాలో 42వేల 390 ఎకరాలల్లో పంట వేశారని, 30వేల 28 మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి వస్తుందని అంచనాతో పత్తి రైతులకు మద్దతు ధర కల్పించేందుకు జిల్లాలో 5జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, అదనపు ఎస్పీ చంద్రయ్య, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం, లీగల్ మెట్రాలజీ అధికారి రూపేశ్ కుమార్, సెస్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి వసంత లక్ష్మి, డీఎం సివిల్ సప్లై రజిత, సీసీఐ అధికారి శక్తి వేల్, ఏఎంసీఐ రజనీ దేవి, మార్కెట్ కమిటీల కార్యదర్శులు, అధికారులున్నారు.

# పండుగ పూట పరేషాన్!

- మహిళలకు ఫైనాన్స్ కంపెనీ వేధింపులు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు తిష్ట వేసిన ప్రతినిధులు
- డబ్బులు కట్టేంతవరకు ఇలానే చేస్తామన్న ప్రతినిధులు
- ఎల్‌డీఎం మేనేజర్ మల్లికార్జున్ మందలింపు • తిరిగి వెళ్లిన ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు
- తంగళ్లపల్లి మండలం కేసీఆర్ నగర్‌లో ఘటన

ఫైనాన్స్ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎల్‌డీఎం మల్లికార్జున్

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 8: పండుగ పూట మహిళలకు ఫైనాన్స్ కంపెనీల వేధింపులు తప్పడం లేదు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో ఉపాధి లేక పూట గడవడమే కష్టంగా మారింది. ఈక్రమంలో అవసరం కోసం చేసిన రుణాలు చెల్లించాలని పండుగపూట ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు వేధింపులు కలకలం రేపింది. తీసుకున్న రుణాలకు కిస్తీలు చెల్లించాలంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు తిష్టవేశారు. ఇటు భర్తలకు ఉపాధి లేక.. ఇల్లు గడవక... చేసిన అప్పులకు కిస్తులు ఎలా కట్టాలని మహిళలు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. తంగళ్లపల్లి మండలం మండేపల్లి శివారులోని కేసీఆర్‌నగర్(డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం)కు చెందిన మహిళలు సిరిసిల్లలోని పలు మైక్రో ఫైనాన్స్ కంపెనీల వద్ద రుణాలు తీసుకున్నారు. ప్రతి 15, 30 రోజులకు కిస్తులు కట్టాలనే ఒప్పందంతో రుణాలు తీసుకున్నారు. కొంతకాలంగా కిస్తులు కడుతున్నారు. కేసీఆర్‌నగర్‌లో ఎక్కువ సిరిసిల్ల పట్టణం నుంచి వచ్చినావారే కావడం తెలిసిందే. వీరంతా వస్త్ర పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. కొంతకాలంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఇల్లుకూడ గడవడం కష్టంగా ఉన్నది. ఈతరుణంలో రుణాలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు కేసీఆర్‌నగర్‌కు ఉదయం 7 గంటలకు చేరుకుని, కిస్తులు కట్టాలని మహిళలను ఇండ్లలోనే తిష్ట వేశారు. మహిళలను ఎటు వెళ్లకుండా అక్కడే ఉండాలని, కిస్తులు కట్టాలని, కట్టే వరకు ఇక్కడే ఉంటామని తేల్చి చెప్పారు. ప్రస్తుతం ఉపాది లేదు.. పండుగ పూట కిస్తులు కట్టే పరిస్థితిలో లేమని, కొంత సమయమిస్తే కిస్తులు కట్టుతామని చెప్పిన అలాగే తిష్టవేశారు. దీంతో సమాచారం అందుకున్న ఎల్‌డీఎం మేనజర్ మల్లికార్జున్ చేరుకుని ఫైనాన్స్ కంపెనీలతో మాట్లాడి, ఇంటి వద్దనే తిష్ట వేసి వసూలు చేసే అధికారం లేదని నోటీస్‌లు ఇవ్వాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో ఫైనాన్స్ ప్రతినిధులు తిరిగి వెళ్లారు. కాగా ఇప్పటికైన ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధుల వేధింపుల నుంచి తమను కాపాడాలని మహిళలు కోరుతున్నారు. కాగా ఈ ఘటన మండలంలో చర్చనీయాంశమైంది.

# పట్టభద్రుల పక్షాన నిలుస్తా

- అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి

మాట్లాడుతున్న అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 8: ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే పట్టభద్రుల పక్షాన నిలిచి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేటీఆర్ నాయకత్వంలో సిరిసిల్లలో అభివృద్ధి జరిగిన మాట వాస్తవమేనన్నారు. డిగ్రీ పూర్తి చేసినా ఉద్యోగాలు రాని వారికి భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే స్థానికంగా అన్ని ప్రభుత్వ పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందించేందుకు కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తానన్నారు. ప్రస్తుతానికి స్వతంత్రంగానే పోటీలో ఉన్నానని స్పష్టం చేశారు. 2021కి ముందు పట్టభద్రులుగా ఉన్న వారంతా నవంబర్ 6లోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల సిబ్బంది, తదితరులున్నారు.

### పట్టభద్రులకు అండగా ఉంటా

వేములవాడ, అక్టోబరు 8 : పట్టభద్రులకు అన్నివేళలా తాను అండగా ఉంటానని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం వేములవాడలోని టీయూడబ్ల్యూజే ఐజేయూ ప్రెస్‌క్లబ్‌లో పాత్రికేయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో ఎన్నికైన ఎమ్మెల్సీలు నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేదన్నారు. నిరుద్యోగ, ఉద్యోగుల సమస్యలు తెలుసుకునేందుకు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు.

## రాజన్నను దర్శించుకున్న ప్రముఖులు

వేములవాడ టౌన్, అక్టోబర్ 8 : శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామివారిని మంగళవారం కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆలయంలో వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో వారికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసి వారికి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

## మలేషియాలో కొలనూర్‌వాసికి నరకం

- ఉపాధి కోసం వెళ్లి అనారోగ్యంతో మంచంపట్టిన కల్లూరి మోహన్
- కుటుంబ సభ్యుల కన్నీరుమున్నీరు • స్వదేశానికి రప్పించాలని వేడుకోలు

కల్లూరి మోహన్

కోనరావుపేట, అక్టోబర్ 8: ఉన్న ఊరిలో ఉపాధిలేక మలేషియా బాటపట్టిన కోనరావుపేట మండలం కొలనూర్‌కు చెందిన కల్లూరి మోహన్ (35) అనారోగ్యంతో అవస్థలు పడుతున్నాడు. మూడు నెలలుగా తిందామంటే బుక్కెడు బువ్వలేక, కాళ్లు, చేతులు చచ్చుబడి పోయి మంచాన పడిపోగా, కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. క్రల్లూరి మోహన్‌ది పేద కుటుంబం. తండ్రి చిన్న తనంలోనే మృతిచెందగా, తల్లి లింగవ్వ, భార్య మౌనిక, కొడుకు ఉన్నారు. ఉపాధి కోసం ఏడేండ్ల క్రితం టూరిస్ట్ వీసాపై మలేషియా వెళ్లాడు. అక్కడ రోజువారీగా దొరికిన కూలీ పనిచేసుకుంటూ ఉంటున్నాడు. ఏమైందోగాని అనారోగ్యం బారినపడ్డాడు. కాళ్లు, చేతులు పని చేయని స్థితిలో మంచానికే పరిమితంకాగా, విషయం తెలుసుకొని కుటుంబ సభ్యులు తల్లడిల్లుతున్నారు. మోహన్‌ను మలేషియాలో సరైన వైద్యం అందేలా చూడాలని, స్వదేశానికి రప్పించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఫోన్‌లో వేడుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే మలేషియాలో ఉన్న ఇండియన్ ఎంబసీకి లేఖ రాయడంతోపాటు ఫోన్‌లో మాట్లాడారు. మోహన్‌కు వైద్య సదుపాయాలను అందించడంతోపాటు సురక్షితంగా ఇంటికి పంపించాలని కోరారు.

### దొంగతనం కేసులో ఒకరికి ఐదు నెలల జైలు

వేములవాడ రూరల్, అక్టోబర్ 8: దొంగతనం కేసులో ఒకరికి ఐదు నెలల కారాగార శిక్ష విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి మంగళవారం తీర్పు వెల్లడించారని వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయపల్లికి చెందిన దుర్గం ప్రవీణ్‌కు చెందిన టీవీఎస్ ఎక్సెల్ బండిని సిద్దిపేట జిల్లా మొచిగళ్ల సర్వాయిగుడికి చెందిన బాణాల గణేశ్ ఏప్రిల్ 4 2024లో దొంగతనం చేయగా బాధితుడు ప్రవీణ్ వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారణ అనంతరం ఎస్ఐ అంజయ్య కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా సీఎంఎస్ ఎస్ఐ రవీందర్‌నాయుడి ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సురేశ్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరుపున పీ విక్రాంత్ కేసు వాదించగా గణేశ్‌కు ఐదు నెలల కారాగార శిక్షను న్యాయమూర్తి జ్యోతిర్మయి విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

### సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఇల్లంతకుంట, అక్టోబర్ 8 : సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి సూచించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని జంగంరెడ్డి పల్లి గ్రామంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులకు తమ ఫోన్‌కు అధార్, బ్యాంకు లింకు ఉన్న ఫోన్ ఇవ్వకూడదన్నారు. ఎవరైనా తమ ఫోన్‌కు ఓటీపీ వచ్చిందని అడిగినా చెప్పవద్దన్నారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఇక్కడ ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్, హెడ్ కానిస్టేబుల్ బండారి శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులున్నారు.

### అంబులెన్స్ బోల్తా పలువురికి గాయాలు

ఇల్లంతకుంట, అక్టోబర్ 8 : పెద్దలింగాపూర్ శివారులో ఒక అంబులెన్స్ మంగళవారం ప్రమాదవశాత్తు బోల్తాపడగా ముగ్గుకి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని దాచారం శివారులో జరుగుతున్న రైల్వే పనుల్లో పనిచేస్తున్న ముగ్గురు అస్వస్థతకు గురయ్యారు. వీరిని చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో డ్రైవర్ తప్పిదం వల్ల అంబులెన్స్ బోల్తాపడింది. స్వల్ప గాయాలైన వీరిని 108లో సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారని తెలిపారు.

### నిబంధనల ప్రకారం ఎమ్మెల్సీ ఓటర్ జాబితా రూపకల్పన

కలెక్టరేట్, అక్టోబర్ 8: : రాష్ట్రంలో త్వరలో ఖాళీ కానున్న టీచర్స్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం ఓటర్ జాబితా రూపకల్పన పక్కాగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఓటరు రూపకల్పనపై జిల్లాల కలెక్టర్లకు వీడియో సమావేశం ద్వారా ఆయన శిక్షణ అందించారు. సమీకృత కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, వేములవాడ రెవెన్యూ డివిజన్ అధికారి రాజేశ్వర్, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

## వాణిజ్య

### సామ్‌సంగ్ టాప్

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ సామ్‌సంగ్ మరోసారి సత్తాను చాటింది. ప్రస్తుత పండుగ సీజన్ తొలి విడుతలో కంపెనీ మొబైళ్లకు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సీజన్‌లో అమ్ముడైన ఫోన్లలో 20 శాతం మార్కెట్ వాటాతో సామ్‌సంగ్ తొలిస్థానంలో నిలిచిందని టెక్ ఇన్‌సైట్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అలాగే సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 6 వరకు కేవలం 11 రోజుల్లోనే 10 లక్షలకు పైగా ఐఫోన్లు కొనుగోలు చేశారు. అత్యధికంగా అమ్ముడైన ఫోన్లలో గెలాక్సీ ఎం35, గెలాక్సీ ఎస్23, గెలాక్సీ ఏ14, గెలాక్సీ ఎస్23 ఎఫ్ ఈలు ఉన్నాయి. బిగ్ బిలియన్ డేస్ పేరుతో ఫ్లిప్‌కార్ట్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించగా, అమెజాన్ ఇండియన్ ఫెస్టివల్ పేరుతో ఆఫర్లను తీసుకొచ్చాయి.

### టాటా టెక్నాలజీస్‌తో బీఎండబ్ల్యూ జట్టు

ముంబై, అక్టోబర్ 8: టాటా టెక్నాలజీస్, బీఎండబ్ల్యూ గ్రూప్ జట్టు కట్టాయి. మంగళవారం తమ జాయింట్ వెంచర్ (జేవీ)ను అధికారికంగా ప్రకటించాయి. బీఎండబ్ల్యూ టెక్ వర్క్స్ ఇండియా పేరిట ఈ జేవీని తెచ్చారు. సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వెహికిల్స్ (ఎస్‌డీవీ)సహా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ఐటీ వ్యాపారం కోసం డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్‌ను ఇది అభివృద్ధి చేయనున్నది. కాగా, 100 మంది ఉద్యోగులతో ఇది మొదలు కానున్నది. పుణె, బెంగళూరు, చెన్నై ఆధారంగా కార్యకలాపాలు సాగుతాయి.

### ఎఫ్ఎంసీజీపై పామాయిల్ పిడుగు

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: అంతర్జాతీయ మార్కెట్లో భగ్గుమంటున్న పామాయిల్ ధరలు దేశీయ ఎఫ్ఎంసీజీ రంగ సంస్థల లాభాలపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నది. సెప్టెంబర్ త్రైమాసికంలో ఆయా సంస్థల లాభాలు భారీగా తగ్గే అవకాశాలున్నాయని సర్వే వెల్లడించింది. ఒకవైపు పామాయిలు ధరలు, మరోవైపు ఉత్పత్తి వ్యయం, ప్రకటనలకోసం అధికంగా నిధులు వెచ్చించడంతో మార్జిన్లు, లాభాలపై ప్రతికూల ప్రభావం పడనున్నది. గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్, డాబర్, మారికోలు తమ లాభాలు ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోయే అవకాశాలున్నాయని పేర్కొన్నాయి.

# హైదరాబాద్‌లో 'రియల్' డౌన్

**19 శాతం తగ్గిన ఇండ్ల అమ్మకాలు దేశీయ ప్రధాన నగరాల్లోనే అత్యధికం**

**జూలై-సెప్టెంబర్‌లో 11,564 యూనిట్లకే పరిమితం ప్రాప్‌టైగర్ తాజా సర్వేలో వెల్లడి**



న్యూఢిల్లీ, అక్టోబర్ 8: రాష్ట్ర రియల్ ఎస్టేట్ మార్కెట్ మందగమనంలోకి జారుకున్నది. హైదరాబాద్‌లో వరుసగా పడిపోతున్న ఇండ్ల అమ్మకాలు దీన్నే సూచిస్తున్నాయి మరి. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలోనూ గృహ విక్రయాలు నీరసంగానే సాగాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ బ్రోకరేజీ వేదిక ప్రాప్‌టైగర్.కామ్ మంగళవారం దేశీయ రెసిడెన్షియల్ మార్కెట్‌పై 'రియల్ ఇన్‌సైట్' పేరిట విడుదల చేసిన నివేదిక ప్రకారం.. గత నెల సెప్టెంబర్‌తో ముగిసిన 3 నెలల్లో హౌజింగ్ సేల్స్ ఏకంగా 19 శాతం దిగజారాయి. దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. నిరుడు జూలై-సెప్టెంబర్‌లో 14,191 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. ఈ ఏడాది ఇదే సమయంలో 11,564 యూనిట్లకే పరిమితమయ్యాయి.

### బయ్యర్లలో తగ్గిన ఆసక్తి

గత ఏడాదిదాకా హైదరాబాద్‌లో పరుగులు పెట్టిన స్థిరాస్తి మార్కెట్.. ఇప్పుడు పడకేసింది. ప్రస్తుతం కొనుగోలుదారుల్లో ఇండ్లను కొనాలన్న ఆసక్తే కనిపించట్లేదని వ్యాపారులు చెప్తున్నారు. మార్కెట్‌లో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులు ఒక కారణమైతే.. రుణ లభ్యత కఠినం కావడం మరో కారణమని వారు అంటున్నారు. కాగా, పరిస్థితులు ఇలాగే సాగితే కేవలం నిర్మాణ రంగమేగాక, దాని అనుబంధ రంగాలూ సంక్షోభంలోకి జారుకుంటాయని ఇండస్ట్రీ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### హైడ్రా ఎఫెక్ట్

రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగంలో హైడ్రా ప్రకంపనల్ని సృష్టిస్తున్నది. హైదరాబాద్‌లో తెచ్చిన హైడ్రా.. ఇతర నగరాల్లోని లావాదేవీలపైనా గట్టి ప్రభావాన్నే చూపుతున్నది. ఇక రాజధాని లోనైతే హైడ్రా దెబ్బకు బయ్యర్లు.. ముఖ్యంగా ఎగువ మధ్యతరగతి వర్గాలు ఇండ్లు, ఫ్లాట్లు, ప్లాట్లు కొనాలనే ఆలోచనే వాయిదా వేసుకుంటున్నారు. దీంతో కొత్త నిర్మాణాలన్నీ ఆగిపోయాయి. ఇప్పటికే పూర్తయిన ఇండ్లనూ కొనే వారు లేకపోవడంతో పెట్టిన పెట్టుబడుల్ని రాబట్టుకొనేందుకు తక్కువ ధరలకు ఇస్తామన్నా ఆదరణే కరువైపోయింది. ఫలితంగా రియల్టర్లు ఆందోళన, ఆవేదన చెందుతున్నారు.

### దేశవ్యాప్తంగా..

హైదరాబాద్‌సహా మొత్తం దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ప్రాప్‌టైగర్.కామ్ తాజా సర్వే జరిగింది. ఇందులో ఢిల్లీ-ఎన్‌సీఆర్ మినహా మిగతా 7 నగరాల్లోనూ హౌజింగ్ సేల్స్ పతనమైనట్టు స్పష్టమైంది. అయితే టాప్-7 నగరాల్లో హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఇండ్ల అమ్మకాలు తగ్గినట్టు తేలింది. కాగా, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 29 శాతం విక్రయాలు పెరిగాయి. గతంతో పోల్చితే 7,800 యూనిట్ల నుంచి 10,098 యూనిట్లకు ఎగిశాయి. కోల్‌కతాలో గరిష్ఠంగా 22 శాతం క్షీణించాయి. 3,607 యూనిట్ల నుంచి 2,796 యూనిట్లకు పడిపోయాయి. ఇక బెంగళూరులో 11 శాతం, అహ్మదాబాద్‌లో 9 శాతం, చెన్నైలో 8 శాతం, పుణెలో 3 శాతం, ముంబైలో 1 శాతం చొప్పున సేల్స్ దిగజారాయి.

# బీవైడీ సరికొత్త ఈవీ

**సింగిల్ చార్జింగ్‌తో 530 కిలోమీటర్లు..**




న్యూఢిల్లీ, అక్టోబర్ 8: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ బీవైడీ..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈమ్యాక్స్ 7 రూ.26.9 లక్షల నుంచి రూ.29.9 లక్షల మధ్యలో లభించనున్నది. వీటిలో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే మాడల్ ధర రూ.26.90 లక్షలు, ఏడు సీట్ల మాడల్ ధర రూ.27.50 లక్షలు, సూపరియర్ మాడల్ రూ.29.30 లక్షల నుంచి రూ.29.90 లక్షల మధ్యలో లభించనున్నది. దీంట్లో 55.4 కిలోవాట్ల బ్యాటరీ ప్రీమియం మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 420 కిలోమీటర్లు ప్రయాణించనుండగా, అలాగే 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.1 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 180 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఆటోమేటిక్ క్లైమెట్ కంట్రోల్, వైర్‌లెస్ చార్జర్, ఎయిర్ ప్యూరిఫైర్, మూడు ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా బీవైడీఇండియా హెడ్ రాజీవ్ చౌహాన్ మాట్లాడుతూ..దేశీయంగా ప్రవేశపెట్టిన నూతన ఈవీ పాలసీలో ప్రయోజనాలు పొందడానికి దరఖాస్తు చేసుకునే అవకాశాలు లేవని స్పష్టం చేశారు.

## ఈసారి కూడా వడ్డీరేట్లు యథాతథమే!

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: ఈసారి కూడా రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయి. దేశవ్యాప్తంగా కూరగాయల ధరలు భగ్గుమంటుండటంతో ఆహార ద్రవ్యోల్బణ సూచీ గరిష్ఠ స్థాయిలోనే నమోదవుతుండటంతో బుధవారం ప్రకటించనున్న తన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనావేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి మాత్రం వడ్డీరేట్లను అర శాతం తగ్గించేందుకు ఆస్కారం ఉన్నదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ ఎండీ, సీఈవో ధీరజ్ రెల్లి తెలిపారు. వరుసగా పది సమీక్షలో వడ్డీరేట్లను ముట్టుకోకపోవడంతో రెపోరేటు 6.50 శాతం వద్ద కొనసాగుతున్నది. దేశ ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగా ఉండటం, పశ్చిమ దేశాల్లో యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో చమురు ధరలు భారీగా పెరిగే అవకాశం ఉన్నదని, ఈ నేపథ్యంలో వచ్చే రెండు సమీక్షల్లో ప్రస్తుత రేట్లను కొనసాగించే అవకాశాలున్నాయన్నారు. తొలి త్రైమాసికంలో వృద్ధి 7.5 శాతం సాధించింది.

## హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ శివార్లో ప్రత్యేకంగా తైవాన్ పరిశ్రమ పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఓ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దండుమల్కాపూర్‌కు సమీపంలో ఈ పార్క్‌ను ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. ఇందుకు సంబంధించి తైవాన్ చాంబర్ ఆఫ